క్లుప్తంగా

20న వేంకటేశ్వరుని దివ్య కల్యాణం

కరప: మండలం యండమూరులో వేంచేసిన సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వెంకటేశ్వర స్వామివారి దివ్యకల్యాణం 20వ తేదీ నుంచి 25వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్టు వంశ పారంపర్య అర్చకులు పెద్దింటి సీతారామం తెలిపారు. వైఖానస మహదాచార్య చక్రవర్తుల వేణుగోపాలాచార్యుల యాజ్ఞికంలో 20వ తేదీన భీష్మ ఏకాదశిరోజు నుంచి నిర్వహిస్తున్నట్టు ఈఓ పీవీఎస్ సూర్యనారాయణరాజు బుధవారం తెలిపారు. ఆలయ అభివృద్ధి దాతలు రాజుపాలెం శ్రీవెంకటేశ్వర ట్రస్టు, గ్రామస్తుల సహకారంతో దేవదాయశాఖ పర్యవేక్షణలో ఏర్పాట్లు చేస్తున్నట్టు ఈఓ తెలిపారు. ఈ మేరకు బుధవారం పందిరిరాట వేశారు.

బకాయిలపై కొరడా



మున్సిపల్ షాపుల యజమానులతో మాట్లాడుతున్న అధికారులు

సామర్లకోట: మున్సిపల్ షాపుల బకాయిలపై టౌన్ ప్లానింగ్, రెవెన్యూ అధికారులు బుధవారం కొరడా ఝుళిపించారు. స్థానిక స్టేషన్ సెంటర్‌లో కొన్ని దుకాణాలకు మొండి బకాయిలు ఉండడంతో దుకాణ యజమానులకు నోటీసులు జారీ చేశారు. దుకాణానికి రూ.రెండు లక్షల వరకు బాకాయిలు ఉండటంతో మున్సిపల్ రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారులు షాపులు సీజ్ చేయడానికి సిద్ధమయ్యారు. మున్సిపాలిటీ నుంచి లీజుకు తీసుకొని షాపుల యజమానులు ఇతరులకు సబ్ లీజ్‌కు ఇచ్చి వారి నుంచి అధిక మొత్తంలో అద్దెలు వసూలు చేస్తూ మున్సిపాలిటీకి అద్దెలు చెల్లించడం లేదని గుర్తించారు. రెండు రోజుల్లో బకాయిలు చెల్లించకపోతే షాపులకు తాళాలు వేస్తామని హెచ్చరించారు. మున్సిపల్ ఇన్‌చార్జి రెవెన్యూ అధికారి ఈసీహెచ్ ప్రసాద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టరు పి.నరేంద్రకుమార్, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

శ్రీరక్షతో అధిక దిగుబడి



ఆర్‌బీ పట్నంలో దుంప పంటను పరిశీలిస్తున్న కేరళ శాస్త్రవేత్తలు

పెద్దాపురం: మెట్టలో సాగవుతున్న దుంప పంటను తిరువనందపురంలోని కేంద్రీయ దుంప పంటల పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ జి.బైజు, డి.జగన్నాథన్, భువనేశ్వర్ శాస్త్రవేత్త డాక్టర్ నెడుంబిజియన్ పరిశీలించారు. పెద్దాపురం దుంప పరిశోధన కేంద్రం, రాయభూపాలపట్నం, కట్టమూరు గ్రామాల్లో కర్ర పెండలం దుంప సాగును బుధవారం పరిశోధనా కేంద్రం శాస్రవేత్త ఎం.జానకి, ఉద్యాన శాఖాధికారి ఎస్.సుజాతలతో కలసి పరిశీలించారు. కేరళ నుంచి తీసుకువచ్చిన శ్రీ రక్ష విత్తనాన్ని ఇక్కడి రైతులకు పంపిణీ చేశామని, 8 నుంచి 9 నెలల వ్యవధిలో కోతకు వచ్చే కర్రపెండలం దుంప దిగుబడిపై రైతుల నుంచి అభిప్రాయాలను సేకరిస్తున్నామని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. సాధారణ విత్తనం కంటే శ్రీరక్ష మరో 10 పుట్లు (ఒక పుట్టు అంటే 75 కిలోలు) అధికంగా దిగుబడి రావడం అభినందనీయమని శాస్త్రవేత్తలు అన్నారు.
అనంతరం రైతుల నుంచి సాగు వివరాలు, దిగుబడి వంటి అంశాలను వారు అడిగి తెలుసుకున్నారు. తొలుత శాస్త్రవేత్తలు గ్రామంలోని కర్రపెండలం సాగు పంటను పరిశీలించి, అక్కడ నుంచి ఫ్యాక్టరీ తరలిస్తున్న దుంప కర్ర దిగుబడిపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌ఏలు ఎం.చిలకమ్మ, విజయదుర్గ, ఎం.సత్తిబాబు, జ్యోతి, మల్లిక్, దివ్య, రైతులు పాల్గొన్నారు.

‘సురక్ష’ శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

మున్సిపల్ కమిషనర్ రామారావు



రోగులకు కిట్లు అందజేస్తున్న వైద్యాధికారితో కమిషనర్ రామారావు

సామర్లకోట: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ జె.రామారావు అన్నారు. స్థానిక యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్‌లో బుధవారం ఆయన ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరాల్లో రోగులను పరీక్షించడం వల్ల ప్రాథమిక స్థాయిలో రోగాలను గుర్తించి మందులు వాడటం ద్వారా మంచి ఆరోగ్యం పొందే అవకాశం ఉంటుందన్నారు. గుండెకు సంబంధించి ఈసీజీ, కంటి పరీక్షలు, బీపీ, సుగర్ వంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేయనున్నట్టు తెలిపారు. డాక్టర్ భవ్యశ్రీ, కౌన్సిలర్ ఆవాల లక్ష్మీనారాయణ, డాక్టర్ వైఎస్సార్ యువసేన ఉమ్మడి జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీనివాసరావు, పాఠశాల హెచ్‌ఎం యు.సత్యనారాయణ, మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు గిడుతూరి శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

మహిళలే పట్టపురాణులు

- వారి పేరునే జగనన్న ఇళ్లు
- రిజిస్ట్రేషన్లతో పూర్తి హక్కు
- 41,891 మందికి లబ్ధి



రిజిస్ట్రేషన్ ప్రక్రియ పరిశీలిస్తున్న నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ నాగనరసింహారావు

కాకినాడ సిటీ: అతివల ఆర్థిక స్వావలంబన కోసం కృషి చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మహిళలను మహారాణులుగా చేస్తోంది. నవరత్నాల్లో భాగంగా జగనన్న ఇళ్లు నిర్మిస్తున్న ప్రభుత్వం లబ్ధిదారులైన మహిళలకు వారి పేరునే పట్టాలు మంజూరు చేసింది. వాటిపై పూర్తి హక్కులు కల్పిస్తూ రిజిస్ట్రేషన్లు చేయిస్తోంది.

గత ప్రభుత్వాలకు భిన్నంగా

గత ప్రభుత్వాలు పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చినా పక్కాగా రిజిస్ట్రేషన్ చేసిన దాఖలాలు లేవు. గతంలో డీ పట్టాలు ఇవ్వడంతో వాటిపై పేదలకు ఎలాంటి హక్కులు ఉండేవి కావు. ఈ క్రమంలో అత్యవసరంలోనూ వాటి వల్ల ఎలాంటి ఉపయోగం ఉండేవి కాదు. కానీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మహిళలకు సర్వహక్కులతో పట్టాలు రిజిస్టర్ చేసి ఇస్తోంది.

లక్షలు విలువ చేసే స్థలాలు రిజిస్ట్రేషన్

ఇంత వరకు తమ పేరిట సెంటు స్థలం లేదని ఆవేదన చెందుతున్న పేద, మధ్య తరగతి కుటుంబాల్లోని మహిళలు ప్రభుత్వ నిర్ణయంతో లక్షాధికారులవుతున్నారు. పట్టణ సమీపంలో ఇస్తున్న స్థలాల మార్కెట్ రేటు పరిశీలిస్తే సెంటు రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షల దాకా పలుకుతోంది. దీంతో లబ్ధిదారుల్లో ఆనందం నెలకొనగా, వారి సంతోషాన్ని రెట్టింపు చేస్తూ పైసా ఖర్చు లేకుండా ఆ ఇంటిని రిజిస్టర్ చేసి పూర్తి హక్కులు కల్పిస్తున్నారు.

కాలనీల్లో సౌకర్యాలు

కాకినాడ అర్బన్, రూరల్ నియోజకవర్గాల్లో మౌలిక వసతులకు ప్రత్యేక ప్రాధాన్యమిస్తున్నారు. సిటీ నియోజకవర్గంలో దాదాపు 750 ఎకరాల స్థలాన్ని సేకరించి 12 లే అవుట్లలో 33,855 వేల మందికి పైగా లబ్ధిదారులను ఎంపిక చేశారు. అలాగే రూరల్ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 8,036 మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేశారు. ఇళ్ల పట్టాలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి 174 ఎకరాల భూమిని కొనుగోలు చేస్తున్నారు. లబ్ధిదారులకు ఈ భూమిని బదలాయించి రిజిస్ట్రేషన్ చేయడం వల్ల కొన్నేళ్ల తరువాత ఆ స్థలంపై సంపూర్ణ హక్కు కలిగి వీటిని లబ్ధిదారుల అవసరాల మేరకు ఇతరులకు విక్రయించుకునే అవకాశం కూడా వస్తుంది.

సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్లు

స్థలాలు, ఇళ్లు పొందిన మహిళలకు రిజిస్ట్రేషన్ చేసే ప్రక్రియ జిల్లాలో ప్రారంభం కానుంది. లబ్ధిదారులకు ఇబ్బందులు కలుగకుండా గ్రామ, వార్డు సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్లు పూర్తి చేసి అర్హులకు హక్కు పత్రాలు ఇస్తున్నారు. ఇందు కోసం పంచాయతీ కార్యదర్శులకు సబ్ రిజిస్ట్రార్ హోదా కల్పిస్తూ ఇటీవలే ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.



కరపలో జగనన్న కాలనీల్లో ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారులకు పట్టాలు రిజిస్ట్రేషన్ చేస్తున్న సిబ్బంది

సంతోషంగా ఉంది



నా పేరు బొబ్బిలి పార్వతి. కరప లే అవుట్ నంబర్ 8లో జగనన్న కాలనీ ఇల్లు మంజూరైంది. ప్రస్తుతం నిర్మాణం చేపట్టాం. ఎప్పటికప్పుడు బిల్లులు అందుతున్నాయి. ఇంటి పట్టా ఇవ్వడమే కాకుండా ఆ స్థలాన్ని ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారు. జగనన్న మా ఇంటిపై శాశ్వత హక్కు కల్పించడం చాలా సంతోషంగా ఉంది.

– బొబ్బిలి పార్వతి, కరప, కాకినాడ రూరల్ నియోజకవర్గం

జగనన్న మేలు మరువలేం



గతంలో ఎన్నో సార్లు ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేశాం. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాలాంటి పేదలను గుర్తించి ఇంటి పట్టా, ఇల్లు నిర్మించి ఇస్తున్నారు. స్థలానికి ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వడం మాకెంతో మేలు జరుగుతుంది.

– మేడిశెట్టి వెంకటలక్ష్మి, కరప

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాకినాడ: వార్షిక విద్యుత్ మరమ్మతుల వల్ల డి–3 సెక్షన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జేఎన్‌టీయూకే విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని డీఈ జి.ప్రసాద్ తెలిపారు. ఫీడర్ పరిధిలోని వెంకట్‌నగర్, జయేంద్రనగర్, డీమార్ట్ ఏరియా, గొడారిగుంట, సురేష్‌నగర్, కొండేలుపేట, మాధవనగర్, శ్రీనగర్, శ్రీవిద్య కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. అలాగే డి1 సెక్షన్ పరిధిలో శుక్రవారం ఉదయం 7.30 నుంచి 11.30 గంటల వరకు వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని డీఈ తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని సాలిపేట, బాలాజీచెరువు, జవహర్‌వీధి, నూకాలమ్మగుడి, బాదం వారివీధి, గోపాలకృష్ణవీధి, దంటువారివీధి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ప్రజలు ఈ అసౌకర్యానికి సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

సంజీవయ్యకు ఘన నివాళి

కాకినాడ రూరల్: సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. వాకర్స్ జిల్లా కౌన్సిలర్ అడబాల రత్నప్రసాద్, పార్థసారధి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనది



ఎంఈఓ బుల్లికృష్ణవేణిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- ఎంఈఓ బుల్లికృష్ణవేణికి ఘనసత్కారం

కరప: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం జిల్లా ఉత్తమ మండలవిద్యాధికారిగా గణతంత్ర దినోత్సవం రోజున సేవా పురస్కారం తీసుకున్న కె.బుల్లికృష్ణవేణిని మండల ఉపాధ్యాయుల తరఫున ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. మండలంలోని 65 ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఈ సత్కారాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనదని, విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేస్తే గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక విద్యకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చి, నాడు–నేడు నిధులతో ప్రభుత్వపాఠశాలలను ఆధునీకరించి, మౌలిక వసతులు కల్పిస్తున్నారన్నారు. 1998లోని డీఎస్సీ అభ్యర్థులకు ఉద్యోగావకాశం కల్పించిన ఘనత సీఎం జగన్‌దేనన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని ఎమ్మెల్యే వివరించారు. విద్యా సంస్కరణలు తీసుకువచ్చిన సీఎం జగన్‌కు వచ్చే ఎన్నికల్లో ఉపాధ్యాయసంఘాలు, ఉపాధ్యాయులు మద్దతుగా నిలవాలన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, మండల యూత్ అధ్యక్షుడు పెంకే సత్తిబాబు, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, ఎంఈఓ–2 పి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దేవతా ప్రతిష్ఠలు



కలశ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు తదితరులు



గురజనాపల్లిలో సాయిబాబాకు కలశపూజ చేస్తున్న మహిళలు

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పూజలు
- అధిక సంఖ్యలో హాజరైన భక్తజనం

కాకినాడ రూరల్: కాకినాడ అర్బన్ రమణయ్యపేట ఒకటో డివిజన్‌లో నూతనంగా నిర్మించిన హరిద్రా గణపతి యుక్త వరలక్ష్మి అమ్మవార్ల ఆలయంలో కలశం, విగ్రహ ప్రతిష్ఠలను బుధవారం ఉదయం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని గణపతి, వరలక్ష్మి అమ్మవార్ల విగ్రహాలను దర్శించుకున్నారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పాల్గొని ఆలయ నిర్మాణ తీరును పరిశీలించారు. కలశ స్థాపన, విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమంలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఒకటో డివిజన్‌లోని స్థానికులతో పాటు కాకినాడ అర్బన్, రూరల్‌లోని భక్తులకు చక్కని ఆలయం అందుబాటులోకి వచ్చిందని అందరికీ గణపతి, వరలక్ష్మి అమ్మవార్ల ఆశీస్సులు ఉండాలని కోరుకున్నారు. వాసురెడ్డి సూరిబాబు, లోవబాబు తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ

కరప: మండలం గొడ్డటిపాలెంలో పునర్నిర్మించిన గ్రామదేవత ఆలయంలో బుధవారం మహాలక్ష్మమ్మతల్లి విగ్రహప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. గ్రామస్తుల వినతిమేరకు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు రూ.10 లక్షలు మంజూరు చేయడంతో సర్పంచ్ వాసంశెట్టి శ్రీనుబాబు, గ్రామస్తులు శిథిలావస్థకు చేరిన ఆలయాన్ని జీర్ణోద్ధరణ చేశారు. కుమారప్రియం వాస్తవ్యులు బ్రహ్మశ్రీ గంగాధరభట్ల అప్పారావు, గ్రామ పురోహితులు భట్లసాయి చైతన్యశర్మ వేద పండితులతో కలసి స్మార్త ఆగమ విధానంలో అమ్మవారి విగ్రహప్రతిష్ఠ చేశారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటుచేశారు.

శిరిడీసాయి మందిరంలో కలశపూజ

మండలం గురజనాపల్లిలోని శ్రీరామసాయి మందిరం 15వ వార్షికోత్సవంలో భాగంగా బుధవారం స్వామికి కలశపూజ చేశారు. 216 మంది మహిళలు ఆలయ వ్యవస్థాపకుడు కర్నాసుల శివకుమార్ ఆధ్వర్యంలో స్వామికి అభిషేకాలు నిర్వహించారు.

శ్రీరామ సప్తాహం ప్రారంభం

స్థానిక కొత్తపేటవీధి కోదండ రామాలయం వద్ద బుధవారం పంచమ శ్రీరామ సప్తాహ మహోత్సవాన్ని ప్రారంభించారు. భీష్మ ఏకాదశి వరకు సప్తాహం నిర్వహించనున్నారు.

పరిశోధనలపై అవగాహన అవసరం



వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభం సందర్భంగా బెలూన్లు ఎగురవేస్తున్న ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్‌పర్సన్ చంద్రకళాదీప్తి, కమిషనర్ వెంకటరావు

కాకినాడ: ప్రతి విద్యార్థి శాస్త్రీయ పరిశోధనలపై అవగాహన పెంచుకోవాలని ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ సూచించారు. స్థానిక సాలిపేట బాలికోన్నత పాఠశాలలో బుధవారం జరిగిన జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ అవార్డ్స్ 2022–23 కార్యక్రమం వేడుకగా సాగింది. కాకినాడ జిల్లా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి, నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు ఇతర అధికారులు పాల్గొన్నారు. ఇన్‌స్పైర్ అవార్డ్‌లకు సుమారు 5,440 నామినేషన్లు రాగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి 279, కాకినాడ జిల్లా నుంచి 132 మందిని ఎంపిక చేశారు. ఎంపికైన ప్రాజెక్టులకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ద్వారా రూ.పదివేల చొప్పున ప్రోత్సాహకాన్ని అందిస్తారు. జిల్లాస్థాయిలో ఎంపికైన ప్రాజెక్టుల నుంచి సుమారు 13 మందిని ఎంపిక చేసి రాష్ట్రస్థాయికి పంపనున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి పి. రమేష్, ఎంఈఓ ఎల్ గణేష్‌బాబు, జిల్లా సైన్స్ అధికారి ఎమ్మెస్ వినీల్, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ ప్రతినిధి బెనర్జీ పాల్గొన్నారు.

సచివాలయాలతో చేరువైన సేవలు

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- రేపూరులో సచివాలయం, వెల్‌నెస్ సెంటర్ల ప్రారంభం



రేపూరులో పేదలకు పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు చేరువయ్యాయని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. మండలంలోని రేపూరు గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, 17 లక్షలతో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్ తదితర వాటిని బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో పేదలకు 148 పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ సచివాలయం, వలంటీర్ వ్యవస్థలతో గ్రామీణ ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి తప్పిందన్నారు. వలంటీర్లు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా నిలిచారన్నారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు కావలసిన అన్ని సేవలను సకాలంలో అందజేస్తున్నారన్నారు. రేపూరు ప్రజలకు అన్ని విధాలుగా అండగా ఉన్నామన్నారు. గ్రామంలోని పేదలకు పండూరులోని జగనన్న కాలనీలో పట్టాలు కేటాయించామన్నారు. పట్టాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్కా వీరన్న, సీనియర్ నాయకులు గోపిశెట్టి బాబ్జీ, టి.ధర్మరాజు, జాన్ ప్రభాకరం తదితరులు పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్లపై పటిష్ట నిఘా

- గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నేరం
- అధికారులతో ఆర్డీఓ కిశోర్ సమీక్ష

కాకినాడ సిటీ: గర్భస్థ పిండ ఆరోగ్య పరిరక్షణలో చేసే అల్ట్రాసౌండ్ స్కానింగ్ లింగ నిర్ధారణకు దుర్వినియోగం కాకుండా పలు సెంటర్లపై నిఘా పెట్టినట్టు ఆర్డీవో ఇట్ల కిశోర్ అన్నారు. బుధవారం కాకినాడ రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో వైద్య, ఆరోగ్యశాఖ, రెవెన్యూ, లీగల్, స్త్రీ శిశు సంక్షేమం, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి డివిజన్ స్థాయి గర్భస్థ శిశు లింగ నిర్ధారణ సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు.
డివిజన్ స్థాయిలో గుర్తింపు పొందిన 110 స్కానింగ్ సెంటర్లపై డెకాయ్ ఆపరేషన్లు, ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. డిసెంబర్, జనవరి నెలల్లో 8 డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించి 56 స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేసినట్టు వివరించారు. గ్రామస్థాయిలో ఏఎన్‌ఎం, ఆశ వర్కర్లు సంయుక్తంగా గర్భిణులు, స్త్రీ గృహాలను సందర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించాలన్నారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లలో పీసీ, పీఎన్డీటీ చట్టానికి సంబంధించిన బోర్డులను, వాల్ పోస్టర్లను, ధరల పట్టిక, ఫిర్యాదుల కోసం టోల్‌ఫ్రీ నంబర్ 18004253365ను తప్పనిసరిగా ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలన్నారు. డీఐవో డాక్టర్ కె.రత్నకుమార్, గైనకాలజిస్ట్ డాక్టర్ పి.సుజాత, జీజీహెచ్ రేడియాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

చలమలశెట్టికి ఘన స్వాగతం

మధురపూడి: కాకినాడ పార్లమెంటు నియోజకవర్గం సమన్వయకర్త చలమలశెట్టి సునీల్‌కు బుధవారం రాజమహేంద్రవరం విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. హైదరాబాద్ నుంచి వచ్చిన ఆయనకు వైఎస్సార్ సీపీ నాయకులు అధిక సంఖ్యలో వచ్చి స్వాగతం పలికారు. ఆయన కార్ల కాన్వాయ్‌లో కాకినాడ వెళ్లారు. వైఎస్సార్ సీపీ ఉభయగోదావరి జిల్లాల కో–ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్, పార్టీ కాకినాడ జిల్లా ఉపాధ్యక్షులు కర్రి వెంకట శివరామకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.



రాజమహేంద్రవరం విమానాశ్రయంలో స్వాగతం పలుకుతున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

ట్రాన్స్‌పోర్టు సమ్మెను జయప్రదం చేయండి

కాకినాడ సిటీ: ది కాకినాడ మినీ గూడ్స్ లారీ అండ్ వ్యాన్ ఓనర్స్ అసోసియేషన్ భవనంలో సీఐటీయూ నగర అధ్యక్షులు పలివెల వీరబాబు ఆధ్వర్యంలో ట్రాన్స్‌పోర్టు కార్మికుల జిల్లా సదస్సు బుధవారం జరిగింది. ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య పాల్గొని రహదారుల విస్తరణ యుద్ధ ప్రాతిపదిక చేపట్టాల్సింది పోయి ప్రమాదాలకు కారణమయ్యే డ్రైవర్లను బాధ్యులను చేయడం అన్యాయం అన్నారు. సదస్సులో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషుబాబ్జీ, ది కాకినాడ మినీ గూడ్స్ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు బొగ్గు సత్యనారాయణ, కాకినాడ ఆటో యూనియన్ నాయకులు తాతపూడి మూర్తి, అమరావతి మినీ గూడ్స్ వ్యాన్ నాయకులు నాగరాజు, వివిధ యూనియన్ నాయకులు గుండుబోగుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సరస్వతీ పూజ

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో సరస్వతీదేవి జన్మదిన వేడుకలు వైభవంగా జరిగాయి. వసంత పంచమి సందర్భంగా బుధవారం విఘ్నేశ్వర పూజతో కార్యక్రమాలు ప్రారంభించి పంచామృతాభిషేకాలు, సరస్వతీ హోమం నిర్వహించారు. అనంతరం పట్టు వస్త్రాలు, బంగారు, వెండి ఆభరణాలతో అమ్మవారికి ప్రత్యేకాలంకరణ చేశారు. విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. వారికి దాత, మాజీ ఎంపీపీ కొండపల్లి కృష్ణమూర్తి దంపతులు, కౌన్సిలర్ యార్లగడ్డ జగదీష్, మాజీ ట్రస్టు బోర్డు సభ్యులు బీవీ రమణ, చల్లా సత్తిబాబు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. అలాగే సరస్వతీదేవి ఫోటోలు, పుస్తకాలు, పెన్నులు అమ్మవారి వద్ద ఉంచి పూజలు చేసి విద్యార్థులకు పంచారు. పలువురు చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేశారు. అక్షరాభ్యాస కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. అల్లకి రాజగోపాల్ సరస్వతీ హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, సన్నిధి రాజు వెంకన్న, చెరుకూరి రాంబాబు, శ్రీకాకుళపు వినయ్ ఈ పూజలు నిర్వహించారు. విద్యార్థులకు దేవి ఫిషరీష్ యాజమాన్యం నోట్ పుస్తకాలు అందజేశారు. అనంతరం ఆలయ అన్నదాన ట్రస్టు ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఈఓ డి.నాగమల్లేశ్వరరావు అన్నదాన ఏర్పాట్లు పర్యవేక్షించారు. అదే విధంగా మెహర్ కాంప్లెక్స్‌లోని గణపతి ఆలయంలోను, మాధవపట్నంలోని యండమూరి వీరేంద్రనాథ్ విద్యాపీఠంలో సరస్వతిదేవికి విద్యార్థులు పూజలు చేశారు.